
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 4 ఆగస్టు 2025







ఇంజనీరింగ్.. సందడికి సిద్ధం

- నేటి నుంచి మొదటి సంవత్సర తరగతులు
- మిగిలిపోయిన సీట్లపై యాజమాన్యాల ఆందోళన
- మరో విడత నోటిఫికేషన్ కోసం యాజమాన్యాల డిమాండ్

సత్తెనపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాబోయే ఇంజనీర్ల కోసం ఇంజనీరింగ్ కళాశాలలు సిద్ధమయ్యాయి. 2025-29 బ్యాచ్ విద్యార్థులకు సంబంధించి సోమవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సం బంధించి సాంకేతిక విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్‌లో సీట్లు దక్కించుకున్న విద్యార్థులు సోమవారం నుంచి తరగతులకు హాజర య్యేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలు కాబోయే ఇంజనీర్ల సందడితో కళకళలా డనున్నాయి. నూతన విద్యార్థులకు స్వాగతం పలికేందుకు పలు కళాశాలల్లో సీనియర్లు, యాజమాన్యాలు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాయి. నూతన విద్యార్థుల్లో బిడియం, బెరుకు పోగొట్టేలా కార్యక్రమాలను కూడా రూపొందించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రెండు యూనివర్సిటీలతో పాటు 36 ఇంజనీరింగ్ కళాశాలలకు సంబంధించి 30 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 25 వేల మంది మాత్రమే ఉండటంతో 6 వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు మిగిలిపోయినట్లు ప్రాథమిక సమాచారం. కొన్ని ప్రధాన ఇంజనీరింగ్ కళాశాలలు మినహా అనేక కళాశాలలో యాజమాన్య, కన్వీనర్ కోటాల్లో సీట్లు మిగిలిపోయినట్లు యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవంగా ఏటా మూడు సార్లు కౌన్సెలింగ్ నిర్వహించేవారు. అయితే ఏడాది రెండుసార్లే నోటిఫికేషన్ జారీ చేయడంతో కొన్ని సీ గ్రేడ్ కళాశాలల్లో సీట్లు భారీ సంఖ్యలో మిగిలినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో (మిగతా 7వ పేజీలో)

కాటా.. కనికట్టు



వైసీపీ హయాంలో ఎండీయూ వాహనాల వద్ద కాటాతో తూకం (పాత చిత్రం)

హుక్ కాటాలతో రేషన్ పంపిణీ పక్కదారి

- బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తోన్న డీలర్లు
- గతంలో ఎండీయూల వద్ద ఉన్న కాటాల వినియోగం

రేషన్ పంపిణీలో పౌరసరఫరాల శాఖ ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు అమలు చేస్తోన్నా అందుకు విరుగుడుని కొంత మంది డీలర్లు ఇట్టే కనుగొంటున్నారు. వృద్ధులు, దివ్యాం గులకు సరుకులు డోర్ డెలివరీ చేసేందుకు ఈ-పోస్ పరికరం, బ్లూటూత్ ఎలక్ట్రానిక్ కాటా కనెక్టివిటీని తొలుత తొలగించారు. ఇదే అదునుగా చాలామంది డీలర్లు వృద్ధులు, దివ్యాం గుల ఇళ్లకు ఈ-పోస్ పరికరం తో వెళ్లి వేలిముద్రలు వేయించి బియ్యానికి బదులుగా కేజీకి రూ.13 నుంచి రూ.14 చొప్పున లెక్క కట్టి చేతిలో పెట్టి ఆ బియ్యా న్ని మాఫియాకు చేరవేసి లబ్ధి పొందారు.



నరసరావుపేట,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బ్లూ టూత్ కనెక్టివిటీని పౌరసరఫరాల శాఖ ఈ నెల ఒకటో తేదీ నుంచి తిరిగి అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం డీలర్లు డోర్ డెలివరీ చేయడానికి వెళ్లినప్పుడు ఈ-పోస్ డివైస్, బ్లూ టూత్ సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటా, సరుకులు తీసుకువెళ్లాలి. అయితే ఇంటింటికి ఎలక్ట్రానిక్ కాటాని తీసుకెళ్లడం సాధ్యపడే వ్యవహారం కాదు. ఈ నేపథ్యంలో గతంలో ఎండీయూల వద్ద ఉన్న బ్లూటూత్ సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటా హుక్(చాలా తేలికగా ఉంటుంది)ని తీసుకెళ్లి వేలిముద్రలు వేయించి బియ్యానికి బదులు నగదు ఇచ్చి లబ్ధి పొందుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి కాస్త కట్టుదిట్టం చేయడంతో దాని ప్రభావం రేషన్ పంపిణీపై పడింది. ఇతర జిల్లాల్లో 40 నుంచి 50 శాతం పైగా పంపిణీ ఇప్పటికే పూర్తి కాగా గుంటూరు జిల్లాలో ఉన్న 972 రేషన్ దుకాణాల్లో శనివారం సాయంత్రం వరకు లక్షా 63 వేల 380 (మిగతా 7వ పేజీలో)

గత నెలలో ఇష్టారాజ్యం..

గత నెలలో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిం చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా డిపో పరిధి లో ఐదు నుంచి 10 శాతం మించి పోర్టబిలిటీ కార్డులకు రేషన్ సరుకులు ఇవ్వరాదు. అయితే జూలైలో కొన్ని షాపుల పరిధిలో 60 శాతం పోర్టబిలిటీ కార్డులకు రేషన్ ఇచ్చారు. దీని వల్ల కొంతమంది డీలర్ల వద్ద సరుకుల నిల్వ అసలు తగ్గలేదు. కొందరి షాపు ల్లో సరుకులు అయిపోయాయి. ఇలా జరగడానికి ప్రధాన కారణం పోర్టబిలిటీపై ఆంక్షలు లేక పోవడమే. అలానే 65 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధు లు, దివ్యాంగులకు ప్రతీ నెల రేషన్ సరుకులు ముం దు నెల 26వ తేదీ నుంచే పంపిణీ చేస్తున్నారు. ఆ నాలుగైదు రోజులు ఈ-పోస్ డివైస్‌తో బ్లూ టూత్ ఎలక్ట్రానిక్ కాటా లింకుని తొలగిస్తున్నారు. ఇదే అదనుగా ఆ నాలుగు రోజుల్లోనే ఎక్కువ కార్డులను ఈ-పోస్‌లో కొట్టేస్తున్నారు.

6 రోజులు.. 106 టీఎంసీలు

మూసివేసిన సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు

- సాగర్ నుంచి ఇప్పటి వరకు నీటి విడుదల
- జలాశయానికి తగ్గిన వరద.. డ్యాం గేట్లు మూత
- జలశోయగాలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకుల నిరాశ

(నరసరావుపేట, విజయపురిసౌత్ ఆంధ్రజ్యోతి)

పరవళ్లు తొక్కుతూ ప్రవహించిన కృష్ణమ్మ శాంతించింది. శ్రీశైలం నుంచి నీటి విడుదల ఆగడంతో దిగువకు ప్రవాహం తగ్గింది. ఆదివారం నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం తగ్గ డంతో డ్యాం క్రస్ట్ గేట్లను మూసివేశారు. అయితే సాగర్ జలాశ యం నుంచి గత కొన్ని రోజులుగా నీటి విడుదల చేస్తుండటంతో జల శోయగాలను వీక్షించేందుకు సెలవు రోజైన ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. అయితే డ్యాం గేట్లు మూసేయడంతో వారంతా నిరుత్సాహానికి లోనయ్యారు. గత నెల 29న డ్యాం క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. జూలై నెలలో 18 ఏళ్లలో నీటి విడుదల చేయడం ఇదే ప్రథమం కావడంతో పలువురు విశేషంగా వ్యాఖ్యానించారు. ఆరు రోజులు సాగర్ జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. మొత్తం 106 టీఎంసీల నీరు డ్యాం నుంచి పులిచింతలకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఇన్‌ఫ్లో 47,714 క్యూసెక్కులు..

ఆదివారం సాగర్ జలాశయంలోకి 47,714 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 28,988, జవహర్ కుడి కాల్వకు 8,604, ఎడమ కాల్వకు 8,022 మొత్తంగా 47,714 క్యూసెక్కుల నీటిని ఆదివారం డ్యాం నుంచి విడుదల చేశారు. నీటి మట్టం 590 అడుగులకు 585.8 అడుగులు ఉంది. పూర్తి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 299.74 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పులిచింతల నుంచి ఆగిన ప్రవాహం

పులిచింతల జలాశయానికి ఆదివారం నీటి ప్రవాహం తగ్గింది. దీంతో డ్యాం గేట్లు బంద్ చేసి నీటి విడుదలను నిలిపివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 18,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 21,131 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వస్తుండగా అదేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. జలాశయంలో 175 అడుగులకు 172.63 అడుగుల నీటి మట్టం ఉంది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలకు 42.18 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

జర్నలిజం అంతిమ ప్రయోజనం.. సమాజ సంక్షేమం
- ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్

ఊరిస్తోన్న.. మిర్చి మార్కెట్!
- మార్కెట్ అన్ సీజన్‌లో జోరుగా మిర్చి విక్రయాలు
- 40 రోజుల్లోనే 20 లక్షల మిర్చి టిక్కీల అమ్మకం

చర్చి కమిటీ నిధుల విషయంలో ఘర్షణ
- జమా ఖర్చులు కోరిన టీడీపీ సభ్యులపై దాడి

వృద్ధురాలిపై దాడి.. బంగారం అపహరణ

బాల్ బ్యాడ్మింటన్ గుంటూరు జిల్లా జట్ల ఎంపిక

7

కబళించిన క్వారీ

- వలస కూలీల ఉసురు తీసిన గ్రానైట్
- వర్షానికి మట్టి కరిగి పడిన రాయి.. ఆరుగురి సమాధి
- మృతులందరూ ఒడిస్సా వాసులే.. 10 మందికి గాయాలు



ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీ

బల్లికురవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): క్వారీలో కోత పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో గ్రానైట్ రాయి కూలీల ఉసురుతీసింది. పొట్టకూటి కోసం ఒడిస్సా నుంచి వచ్చిన కూలీల బతుకులను క్వారీ కబళించేసింది. బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూ పరిధిలోని ఈర్లకొండ వద్ద ఉన్న సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఒడిస్సాకు చెందిన 16 మంది కూలీలు ఆదివారం పని చేస్తున్నారు. అయితే శనివారం కురిసిన వర్షానికి క్వారీ ఎగువ భాగంలో ఉన్న రాయి కింద మట్టి కరిగి పోయింది. అయితే దీనిని గమనించని కూలీలు పనులు చేస్తుండగా ఆ గ్రానైట్ రాయి వారిపై పడింది. దీంతో నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు కూలీలు మృతి చెందారు. ఒడిస్సాలోని గంజాం జిల్లా చస్సనిమ్మకాడి గ్రామానికి చెందిన దండ బడత్య(48), కసాయ్ గ్రామానికి చెందిన సంతోష్‌గౌడ (36), దుగాన్ గ్రామానికి చెందిన ముస్సాజన(43), గజపతి జిల్లా చాందిపుట్ గ్రామానికి చెందిన టుకున దలాయ్(37), పసిగూడ గ్రామానికి చెందిన బనమల బెహ్రా(30), చాందిపుట్ గ్రామానికి చెందిన భాస్కర్ బిషోయ్(40)లు మృతి చెందారు.గాయపడిన సుదర్సన్, అలోక్ నాయక్, శిరాగౌడ, మహేంద్ర బెహ్రా, వెంకయ్య, సుభాష్‌మాలిక్, పవిత్ర బెహ్రా, దంబాలతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఆలోక్‌నాయక్, శివగౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. క్వారీ ప్రమాదంపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూలీల కుటుంబాలను ఆదుకుంటామన్నారు.

స్నేహితుల దినోత్సవం రోజున విషాదం

భాస్కర్ బిషోయ్, టకున దలాయ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఒడిస్సా నుంచి క్వారీలో పనికి కూడా ఇద్దరు కలిసే వచ్చారు. కలిసి వచ్చిన స్నేహితులు స్నేహితుల దినోత్సవం రోజు కలిసి మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలుముకుంది.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆ రైళ్లు.. ఆగలేదు


- పలు రైళ్లకు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో నిలుపుదల రద్దు
- ప్రయోగాత్మక స్టాపేజీల కొనసాగింపులో జాప్యం
- రైల్వే అధికారుల తీరుపై ప్రయాణికుల ఆగ్రహం

గుంటూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత నుంచి ఆగుతున్న పలు రైళ్లు ఆదివారం ఆయా స్టేషన్లలో ఆగలేదు. దీంతో పలువురు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత గుంటూరు రైల్వే డివిజన్‌లోని పలు స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయోగాత్మక స్టాపేజ్‌లను రైల్వే శాఖ అమలు చేస్తున్నది. దీనిని ప్రతీ ఆరు నెలలకు ఒకసారి సమీక్షించి కొనసాగిస్తున్నది. అయితే ఈ దఫా ప్రయోగాత్మక స్టాపేజ్‌లను కొనసాగించాలని విజ్ఞాపన లేఖ పంపడంలో గుంటూరు రైల్వే డివిజన్ నుంచి జాప్యం జరిగింది. దీంతో ఆదివారం నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి రైల్వేస్టేషన్లలో పలు రైళ్ల స్టాపేజి రద్దు చేశారు. విశాఖ ఎక్స్‌ప్రెస్, నరసాపూర్, చెన్నై సెంట్రల్ - చర్లపల్లి, నారాయణాద్రి, నరసపూర్ - లింగం పల్లి, లింగంపల్లి - నరసపూర్, చెన్నై - కాకినాడ పోర్టు, ధర్మవరం - మచిలీ పట్నం, కాచీగూడ - రేపల్లె, యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంగళగిరి, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, న్యూగుంటూరు, వేజండ్ల, కంభం తదితర రైల్వే స్టేషన్లలో నిలుపుదల సదు పాయం నిలిచిపోయింది. ఇతర డివిజన్లు ముందుగానే స్పందించి రైల్వే బోర్డుకు నివేదించి ప్రయోగాత్మక స్టాపేజ్‌లను కొనసాగించుకొంటుండగా గుంటూరు డివిజన్ చేసిన జాప్యం ప్రయాణికులను ఇబ్బందుల్లో పడేసింది. కనీసం సోమవారం అయినా డివిజనల్ రైల్వే ఉన్నతాధికారులు హెడ్‌క్వార్టర్స్‌తో మాట్లాడి ప్రయోగాత్మక స్టాపేజ్‌లు కొనసాగించేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



హెచ్‌ఎం అసోసియేషన్ కార్యవర్గం

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి). ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రకాష్‌నగర్‌లోని తిలక్ ఉన్నత పాఠశాలలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిశెట్టి గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డి శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా పులిపాటి శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షుడిగా కొండా శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా బి.ఎం.సుభాని, ఎ.శ్రీనివాసరెడ్డి, వి.విజయలక్ష్మి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరిగా ఎం.రామారావు, జిల్లా హెడ్‌క్వార్టర్ సెక్రటరిగా వై.హనుమంతరావు, మీడియా ప్రతినిధిగా వి.వెంకటరావులను ఎన్నుకున్నారు.



శాకాంబరిగా గంగమ్మతల్లి

శ్రావణమాస రెండో ఆదివారాన్ని పురస్కరించుకుని పిడుగురాళ్ల లోని గంగమ్మతల్లిని శాకాంబరిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాగులగుడి దేవాలయం అర్చకులు గుంటుపల్లి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. - పిడుగురాళ్ల



గోలి వాగుపై నిర్మించిన బ్రిడ్జి

నెరవేరిన దశాబ్దాల కల

గోలివాగుపై రూ.30 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం • ఎన్నికల హామీ నెరవేర్చడంపై గ్రామీణుల హర్షం

రెంటచింతల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాగు పొంగితే ప్రాణభయం.. వర్షాల సమయంలో ఇతర గ్రామాలతో రాకపోకలు బంద్.. అత్యవసరమైనా వాగు దాటలేని పరిస్థితి. దశాబ్దాలుగా బ్రిడ్జి నిర్మాణంపై ప్రజల వినతులు.. నేతల హామీలతో సరిపోయింది. గత ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగానే ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి గోలి గ్రామ సమీపంలోని గోలి వాగుపై రూ.30 లక్షలతో నూతనంగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారు. గతంలో ఎప్పుడో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వాగు పొంగిపొర్లడం వాహనాల రాకపోకలు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. ఏడుమంగళం, పిల్లివాగు నీళ్లన్నీ గోలివాగులో వచ్చి కలుస్తుండేవి. దీంతో ప్రవాహ వేగం అధికంగా ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉండేవి. ఈ పరిస్థితుల్లో నూతనంగా బ్రిడ్జి నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు నాలుగు దశాబ్దాల నుంచి డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎట్టకేలకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కృషి ఫలించింది. 135 మీటర్ల పొడవు, 5.5 మీటర్ల వెడల్పుతో రూ.30 లక్షలతో నిర్మించిన బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. భారీ వర్షం కురిసినా రాకపోకలకు ఇబ్బంది లేకుండా మీటర్ వ్యాసార్థంతో ఏడు పైపులు, 2 ఖానాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నర్సరావుపేట లీగల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ రోడ్డులో శనివారం 50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు రెండవ పట్టణ ఎస్ఐ హరిబాబు తెలిపారు. శ్రీనివాస్ నగర్‌కి చెందిన డీలర్ నూతలపాటి శ్రీనివాసరావు నుంచి నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన నర్రా రామకృష్ణ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యం తీసుకెళ్తుం డగా.. స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనం, బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

దిక్సూచి



క్యాట్ 2025

దేశంలోని ప్రీమియర్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో అడ్మిషన్‌కు ఉద్దేశించిన 'కామన్ అడ్మిషన్ టెస్ట్'(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎమ్) మాత్రమే కాకుండా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ-ఢిల్లీ, కోల్‌కతా), ఐఐటీల్లోని ఎంబీఏ కోర్సులు, టాప్ బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్ల కోసం కూడా ఉపయోగపడుతుంది. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో ఈ ఎంట్రెన్స్‌ను నిర్వహించనున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఎంట్రెన్స్‌కు గత సంవత్సరం 2.93 లక్షల మంది హాజరయ్యారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 45 శాతం చాలు.

పరీక్ష విధానం: గత సంవత్సరం ప్రశ్నపత్రం ఇలా ఉంది. మొత్తం మార్కులు 204. మొత్తం ప్రశ్నలు 68. ఇందులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 48, నాన్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 20. ప్రతీ విభాగానికి 40 నిమిషాల చొప్పున మొత్తం సమయం రెండు గంటలు ఉంటుంది. ఎంసీక్యూలకు మాత్రం నెగెటివ్ మార్కులు ఉంటాయి. నాన్ ఎంసిక్యూలకు నెగెటివ్ మార్కులు లేవు.

- వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ - 24 ప్రశ్నలు
- డేటా ఇంటప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ - 22 ప్రశ్నలు
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ - 22 ప్రశ్నలు

ఈ సంవత్సరం కూడా పెద్దగా మార్పులు లేకుండా ఇలాగే ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు సిద్ధం అయితే మంచిది.

ప్రిపరేషన్ టిప్స్: భారతదేశంలో అత్యంత పోటీ ఉన్న పరీక్షల్లో 'క్యాట్' ఎంట్రెన్స్ ఒకటి. వంద పర్సంటైల్ ఉన్నవారికి కూడా అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో సీటు వస్తుందన్న గ్యారంటీ లేదు. సీటు సాధించడంలో పర్సంటైల్‌తోపాటు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే పరీక్షలో మంచి మార్కులు వస్తేనే ఆ దశకు చేరుకోగలుగుతారు. అందుకోసం కొన్ని మెలకువలను పాటించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్: క్యాట్ ప్రిపరేషన్‌లో ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఇది. ప్రతీ సెక్షన్ సమాధానాలను 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. అందుకోసం ప్రిపరేషన్ సమయంలో స్పీడ్, ఆక్యురసీపై బాగా దృష్టిపెట్టాలి.

షార్ట్‌కట్ టెక్నిక్: నిర్దీత సమయంలో సమాధానాలు గుర్తించాలంటే షార్ట్‌కట్ పద్ధతులు అనుసరించాల్సిందే. ప్రిపరేషన్ సమయంలో మెంటార్లు చెప్పే మెలకువలను బాగా గుర్తుంచుకుని పాటించాలి. ముఖ్యమైన వాటిని ఒక దగ్గర రాసుకుని తరచుగా రివ్యూ చేసుకుంటూ ఉండాలి.

గత ప్రశ్నపత్రాలు సాల్వ్ చేయడం: గత సంవత్సరాల ప్రశ్న పత్రాలను సాల్వ్ చేయడం ద్వారా డిఫికల్టీ లెవెల్ బాగా అర్థం అవుతుంది. అలాగే మాక్‌టెస్ట్‌లు రాయడం వల్ల నిర్ణీత సమయంలో సాల్వ్ చేయగలుగుతున్నారా లేదా అనేది చెక్ చేసుకోగలుగుతారు. అలాగే తమ బలాలు, బలహీనతలు తెలుస్తాయి.

- క్యాట్‌లో మరో ముఖ్యమైన విషయం ఏమంటే చాయిస్ ఆఫ్ క్వశ్చన్స్. అటెంప్ట్ చేయకముందే దానిని పూర్తి చేయగలం అనే నమ్మకం ఉన్నప్పుడు మాత్రమే దానిని సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి.
- వొకాబులరీ, రీడింగ్ స్కిల్స్ మెరుగు పరుచుకోవడానికి పుస్తకాలు, దినపత్రికలు, అందులోని ఎడిటోరియల్స్, జర్నల్స్ క్రమం తప్పకుండా చదవాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 13
పరీక్ష తేదీ: 2025 నవంబర్ 30
ఫలితాలు: 2026 జనవరి మొదటి వారం
వెబ్‌సైట్: https://iimcat.ac.in

ఐబీపీఎస్‌లో 10,277 క్లర్క్ పోస్టులు

క్లర్క్ పోస్టుల భర్తీకి 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్'(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టులను భర్తీ చేస్తారు. మొత్తం 10,277 పోస్టులు ఉన్నాయి. ఇందులో తెలంగాణలో 261, ఆంధ్రప్రదేశ్‌లో 367 ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ సర్టిఫికెట్ లేదా స్కూలు, కాలేజీలో కంప్యూటర్ సబ్జెక్ట్ అయినా ఉండాలి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా ఎంపిక జరుగుతుంది. స్థానిక భాషలో రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

పరీక్ష విధానం: ప్రిలిమినరీ ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. 60 నిమిషాల వ్యవధిలో వంద ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి వంద మార్కులు ఉంటాయి.

ఇంగ్లిషు	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు

ఇందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ పరీక్షకు పిలుస్తారు. ఇది కూడా ఆబ్జెక్టివ్ పరీక్షనే. ఇక్కడ 200 మార్కులు 155 ప్రశ్నలు ఉంటాయి. వీటికి రెండు గంటల్లో సమాధానాలు గుర్తించాలి.

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	40 ప్రశ్నలు	50 మార్కులు	20 నిమిసాలు
జనరల్ ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	40 ప్రశ్నలు	60 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్	35 ప్రశ్నలు	50 మార్కులు	30 నిమిషాలు

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఆగస్టు 2 నుంచి 2005 ఆగస్టు1 లోపు జన్మించి ఉండాలి(రెండు తేదీలను కలుపుకొని). ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, ఓబీసీలకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాలు, వితంతువులు/ విడాకులు పొందిన మహిళలు 35 సంవత్సరాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మాజీ మిలిటరీ ఉద్యోగులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.

ఖాళీలు ఉన్న బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

దరఖాస్తు ఫీజు: రూ.850/-. ఎస్సీ/ ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ ఈఎస్‌ఎమ్/డీఈఎస్‌ఎమ్ అభ్యర్థులకు రూ.175/-.
ప్రిలిమినరీ పరీక్ష: 2025 అక్టోబర్
మెయిన్స్ పరీక్ష: 2025 నవంబర్
చివరి తేదీ: 2025 ఆగస్టు 21
వెబ్‌సైట్: ibps.in

జాబ్ కార్నర్

పదో తరగతితో ఐబీలో..

మొత్తం ఖాళీలు 4,987

కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో దేశవ్యాప్తంగా 4987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందులో తెలంగాణకు 117 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌కు 115 పోస్టులు ఉన్నాయి.

అర్హత: పదో తరగతి పాసై ఉండాలి. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. స్థానిక భాష రాయడం, మాట్లాడడం, చదవడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ ఫీల్డ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్టు 17 నాటికి 18-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు వయో పరిమితిలో మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం:

టైర్-1: వంద మార్కులకు ఆబ్జెక్టివ్ టెస్ట్ ఉంటుంది. 60 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాలి. ఇందులో జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్/అనలిటికల్, లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.

టైర్-2: యాభై మార్కులకు భాషా అనువాదం డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. వ్యవధి ఒక గంట. ఇది క్వాలిఫైయింగ్ టెస్ట్ మాత్రమే.

టైర్-3: ఇంటర్వ్యూ యాభై మార్కులకు ఉంటుంది.

చివరి తేదీ: ఆగస్టు 17
వెబ్‌సైట్: www.mha.gov.in/en

ఎయిమ్స్ & ఇతర సంస్థల్లో..

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)తోపాటు, ఇతర జాతీయ వైద్య సంస్థల్లో నర్సింగ్ పోస్టుల భర్తీ జరగనుంది. ఎయిమ్స్, జిప్మర్, ఈఎస్ఐసీల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా నింపనున్నారు.

అర్హత: బీఎస్సీ నర్సింగ్ / పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంతోపాటు, కనీసం 50 పడకల ఆస్పత్రిలో రెండేళ్ల పని అనుభవం.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండాలి. రిజర్వేషన్‌లను బట్టి సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 ఆగస్టు 11
పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్14న స్టేజ్-1 పరీక్ష, 2025 సెప్టెంబర్ 27 స్టేజ్-2 పరీక్ష.
వెబ్‌సైట్: www.aiimsexams.ac.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది

- సత్యదేవ్



'కింగ్‌డమ్' సినిమా మొదటి ఆట చూసినప్పటి నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. నటుడిగా నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది' అని సత్యదేవ్ అన్నారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ప్రేక్షకాధరణతో కొనసాగుతోన్న సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన సత్యదేవ్ మీడియాతో మాట్లాడారు. 'శివ పాత్ర కోసం దర్శకుడు గౌతమ్ మొదట నా పేరే రాసుకున్నారట. కథ నచ్చి వెంటనే ఓకే చెప్పాను. యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాను. 'కింగ్‌డమ్'లో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే నా యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది. ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్ కోసం చాలా కష్టపడ్డాం. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక..ఆ కష్టమంతా మరచిపోయాను' అని సత్యదేవ్ చెప్పారు.

వేతన పెంపు లేకుంటే షూటింగ్స్ బంద్

- ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం

వేతనాలు పెంచేవరకూ 24 కార్మిక సంఘాలు షూటింగ్స్‌లో పాల్గొనకూడదని టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడంతో ఫెడరేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. వేతనాల పెంపు డిమాండ్‌పై చర్చించేందుకు ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ సర్వసభ్యసమావేశం నిర్వహించింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను ఫెడరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. నేటి (ఆగస్టు 04) నుంచి 30 శాతం వేతనాలు పెంచుతామని హామీ పత్రం ఇచ్చిన నిర్మాతల షూటింగ్స్‌కు మాత్రమే వెళ్లాలి, వేతనాల పెంపు అమలు చేయని సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని తీర్మానించింది. పెంచిన వేతనాలను ఏ రోజుకారోజే చెల్లించే విధానం అమలు చేయాలనీ, ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేసిన తర్వాతనే షూటింగ్స్‌లో పాల్గొనాలని 24 కార్మిక సంఘాలకు తెలిపింది.

కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం

ఫెడరేషన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఫిల్మ్ ఛాంబర్ స్పందించింది. 'ఫెడరేషన్ పక్షపాతంతో 30 శాతం వేతనాల పెంపును డిమాండ్ చేస్తోంది. ప్రస్తుత చట్టాల ప్రకారం నైపుణ్యం ఉన్నవారికి, లేనివారికి కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం. ఈ సమ్మె నిర్ణయం నిర్మాణంలో ఉన్న చిత్రాలకు భారీ నష్టాన్ని కలిగిస్తుంది. ఫెడరేషన్‌తో కలసి పనిచేస్తున్న మనం ఈ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చిస్తాం. అంతవరకూ నిర్మాతలు ఎలాంటి స్వతంత్ర చర్యలు గానీ సంఘాలతో ప్రత్యేక ఒప్పందాలు గానీ చేసుకోకుండా ఛాంబర్ మార్గదర్శకాలను అనుసరించాలని కోరుతున్నాం. శాశ్వత పరిష్కారం కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం ఐక్యతతో ఉండాలి. మరిన్ని వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

ఈ సినిమాను పవన్ చూడాలి

- నిర్మాత అల్లు అరవింద్



'మా కుటుంబంలో, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయన సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతారు. 'మహావతార్ నరసింహ' సినిమాని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నా' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన 'మహావతార్ నరసింహ' సినిమా ఇటీవలె విడుదలై మంచి ప్రేక్షకాదరణతో థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'భారతదేశమంతటా ప్రేక్షకులు ఈ సినిమాకు జేజేలు పలుకుతున్నారు. హైదరాబాద్‌లోని ఏఎంబీలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూడటం నాకు చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు.

నవ్వుల పండగ



కన్నడనాట ఇటీవలె విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న చిత్రం 'సు ఫ్రమ్ సో'. తాజాగా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈనెల 8న మైత్రీ మూవీమేకర్స్ విడుదల చేస్తోంది. జేపీ తుమినాడ్ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించారు. షనీల్ గౌతమ్, సంధ్య అరకెరె ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్.బి.శెట్టి, శశిధర్ శెట్టి బరోడా, రవిరాయ్ కలస నిర్మించారు. ఆసక్తికరమైన కథ, కథనంతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు నవ్వుల పండగను అందిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు.

యువతా నీ గమ్యం ఎటు వైపు?



హీరో కృష్ణసాయి కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'డేంజర్'. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు? అంటూ సందేశాత్మకంగా సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్యవంతమైన గీతాన్ని రూపొందించాం. మా ప్రయత్నాన్ని గవర్నర్లు, పోలీస్ అధికారులు ప్రశంసించారు. ఈ సినిమా ప్రజలను ప్రభావితం చేస్తుంది. యువతలో మార్పు తీసుకొస్తుందనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

కొరియోగ్రాఫర్ కృష్ణపై పోక్సో కేసు

టాలీవుడ్‌లో మరో లైంగిక ఆరోపణల కేసు నమోదైంది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలపై కొరియోగ్రాఫర్ కృష్ణ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం ఓ పెళ్లయిన మహిళతో కృష్ణ మాస్టర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనీ, ఈ క్రమంలో ఆమె కూతురిపై కూడా కృష్ణ లైంగిక దాడి చేశాడంటూ సదరు మహిళ జూలై 9న ఫిర్యాదు చేశారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ముగింపును మార్చడం నన్ను బాధించింది

- ధనుష్



ధనుష్ కథానాయకుడిగా ఆనంద్.ఎల్.రాయ్ తెరకెక్కించిన 'రాంఝనా' 2013లో విడుదలై సంచలన విజయం సాధించింది. ఇందులోని పాటలు, భావోద్వేగాలు అందరినీ ఆకట్టుకోగా, ముగింపు చాలా మందిని కంటతడి పెట్టించింది. ఇటీవలె ఈ సినిమాను తమిళనాడులో రీ రిలీజ్ చేశారు. అయితే, ఏఐ సాయంతో ఇందులోని క్లైమాక్స్‌ను నిర్మాతలు మార్చారు. 2013లో విడుదలైన ఒరిజినల్ వెర్షన్ ముగింపులో తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిన హీరో చికిత్స తీసుకుంటూ చనిపోతాడు. అయితే, కొత్తగా విడుదల చేసిన వెర్షన్‌లో హీరో కోలుకున్నట్టు చూపించారు. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వెర్షన్ చూసిన ఫ్యాన్స్ కొందరు ఆనందం వ్యక్తం చేస్తుండగా, దీనిపై ధనుష్, ఆనంద్.ఎల్.రాయ్‌తో పాటు మరికొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ సినిమా ముగింపును మార్చడం నన్ను కలచివేసింది. క్లైమాక్స్ మార్పు, సినిమా ఆత్మను దెబ్బతీసింది. నేను వద్దంటున్నా ఈ రీ రిలీజ్‌కు ముందుకెళ్లారు. 12 ఏళ్ల క్రితం నేను చేసిన సినిమా ఇది కాదు. ఇలా ఏఐతో సినిమా కంటెంట్‌ను మార్చడం కళతో పాటు కళాకారులకు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పనులు కథ చెప్పే విధానానికీ, సినిమా వారసత్వానికీ ప్రమాదకరం. భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాను' అని ధనుష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలా కృత్రిమ మేధ సాయంతో సినిమా కంటెంట్‌ను మార్చే ప్రయత్నం అర్థరహితమైంది. 12 ఏళ్లుగా ఈ సినిమాను తమ హృదయాల్లో పదిలంగా దాచుకున్న అభిమానుల నమ్మకాన్ని వమ్ము చేయడమే' అని ఆనంద్.ఎల్.రాయ్ విమర్శించారు.

అలరించే కామెడీ థ్రిల్లర్



ప్రవీణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్ జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో హీరో సుధీర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నందుకు సంతోషంగా ఉంది. 'బకాసురు రెస్టారెంట్' ఘన విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ప్రవీణ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో హీరోగా పెట్టి సినిమా తీసిన మా దర్శక నిర్మాతలకు నా ధన్యవాదాలు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది' అని చెప్పారు. దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ 'ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది' అని అన్నారు.

క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీవోపై హర్షం

గుంటూరు (విద్య), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీవోను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు విడుదల చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మ) రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంపాలెం ప్రజ్ఞ స్మార్ట్ స్కూల్‌లో జీవో కాపీలను ఆవిష్కరించి, విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు అకారణంగా బయట వ్యక్తులు, కొంతమంది తల్లిదండ్రుల నుంచి అనేక ఒత్తిళ్లు, దౌర్జన్యాలు ఎదుర్కోవడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ప్రకారం ప్రైవేట్ స్కూల్స్ క్యాంపస్‌లలో రాజకీయ పార్టీలకు సంబంధించిన గుర్తులు, వస్తువులు,



కరపత్రాలు విడుదల చేస్తున్న అపుస్మ నాయకులు విష్ణుప్రసాద్ తదితరులు

జెండాలు, ప్రదర్శనలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. అలాగే సమూహాలు, వివిధ సంఘాల పేరుతో విధ్వంసాలు, భౌతిక దాడులకు దిగడం నేరమని తెలిపారు. అపుస్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.మస్తాన్ రావు, అడిషనల్ ట్రెజరర్ కాటూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నాయుడు చక్రనాగ్, నగర అధ్యక్షుడు కన్నా మాస్టర్, జిల్లా కోశాధికారి ఎస్.సాంబిరెడ్డి పాల్గొన్నారు.

జూడో జిల్లా స్థాయి ఎంపికలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) జూడో సంఘ ఆధ్వర్యంలో మంగళగిరిలోని డాన్ బాస్కో స్కూల్లో ఆదివారం జూడో జిల్లా ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో పెద్ద పరిమిలో జరగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొననున్నట్లు సంఘ కార్యదర్శి బి.కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సంఘ అధ్యక్షుడు ఎ.శ్రీహరి నాయుడు, పీఈటీ రాజు, శిక్షకులు నాగదుర్గ, సాంబశివరావు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఎం.గురుతేజ, బి.రేవంత్‌బాబు, జి.ప్రసాద్ ఎస్.యశ్వంత్, సీహెచ్ లక్ష్మీ నరసింహమూర్తి, పి.నాగాచరణ్, కె.గౌతమ్, కె.దుర్గాప్రసాద్, టి.జాకబ్, బాలికల విభాగంలో ఎస్ దివ్యశ్రీ, ఎం.ప్రశాంత, ధన్య శివ నాగజ్యోతి, డి.పవిత్ర, పి.పావని షేక్ అఫ్సన, టి.విజయలక్ష్మి, వై.అమూల్య, జి.మధురిమ ఎంపికయ్యారని తెలిపారు.

ఊరిస్తోన్న.. మిర్చి మార్కెటు!

- మార్కెట్ అన్ సీజన్‌లో జోరుగా మిర్చి విక్రయాలు
- 40 రోజుల్లోనే 20 లక్షల మిర్చి టిక్కీల అమ్మకం
- కోల్డ్ స్టోరేజుల్లో 45 లక్షల బస్తాల నిల్వలు
- ధరలు పెరిగే అవకాశం ఉందని అంచనా

గుంటూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా నష్టాల ఊబిలో కూరుకుపోయిన మిర్చి రైతులకు.. ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు కొత్త ఆశలను రేకెత్తిస్తోన్నాయి. ఎప్పుడూ లేని విధంగా మిర్చి సీజన్ ముగిసిన తర్వాత రోజుకు 50 వేల టిక్కీల విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో రాబోయే మూడు నాలుగు నెలలు ధరలు పెరిగి, స్థిరంగా కొనసాగడానికి అవకాశాలున్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకపక్క కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వలు తగ్గిపోతున్నాయి. మరోవైపు కొత్త పంట విస్తీర్ణం ఈ ఏడాది తగ్గే అవకాశం ఉందని ఉద్యాన శాఖ చెబుతోంది. దీంతో కచ్చితంగా మిర్చికి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లోని పచ్చి మిర్చి ధర కేజీ రూ.20 నుంచి రూ.90కి చేరింది. ఆయా ప్రాంతాల నుంచి ఎండు మిర్చి వచ్చే పరిస్థితి లేదు.

రోజుకు 50 వేల టిక్కీల విక్రయం

గుంటూరు మిర్చి యార్డులో ఏటా డిసెంబరు నుంచి మే నెల మొదటి వారం వరకు సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలోనే వేర్వేరు జిల్లాలు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా రైతులు మిర్చిని అమ్మకానికి తీసుకొస్తారు. వేసవి ముగిసిన తర్వాత జూన్ రెండో వారం నుంచి అన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చిని తీసుకొచ్చి రైతులు విక్రయిస్తుంటారు. అన్ సీజన్‌లో రోజుకు 20 వేల నుంచి 30 వేల టిక్కీల మధ్యనే గత కొన్నేళ్లుగా యార్డులో విక్రయాలు జరుగుతున్నాయి. అలాంటిది ఈ సంవత్సరం రోజుకు 50 వేలు సగటున టిక్కీలను కోల్డ్ స్టోరేజ్‌ల నుంచి రైతులు బయటకు తీసుకొస్తున్నారు. సీజన్ ప్రారంభంలో గుంటూరు జిల్లాలోని కోల్డ్ స్టోరేజ్‌లలో 65 లక్షల టిక్కీలు ఉండగా ఇప్పుడు.. ఆ సంఖ్య 45 లక్షలకు తగ్గింది.

ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు..

మిర్చి సీజన్‌లో ఈ ఏడాది టాప్ క్వాలిటీ వెరైటీలు కూడా క్వింటాల్ రూ. 13 వేలు దాటలేదు. నాణ్యత తక్కువగా ఉన్న రకాలకు క్వింటాల్ ధర రూ.8 వేలు మాత్రమే లభించింది. ఇప్పుడు తేజ వెరైటీ క్వింటాల్ రూ. 14 వేలకు చేరుకొంది. రైతులకు వ్యాపారుల నుంచి అప్పు పుట్టకపోతుండడంతో.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ ఇలానే రైజింగ్‌లో ఉంటే కచ్చితంగా ఈ నెలలోనే ధరల్లో పెరుగుదల కనిపించొచ్చని భావిస్తున్నారు.

జర్నలిజం అంతిమ ప్రయోజనం.. సమాజ సంక్షేమం

● ప్రెస్ అకాడమీ ఛైర్మన్ సురేష్‌కుమార్


తెనాలి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జర్నలిజం అంతిమ ప్రయోజనం సమాజ సంక్షేమం కావాలని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండు రోజుల గ్రామీణ విలేకర్ల శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. సభకు ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. గ్రామీణ విలేకర్ల పునశ్చరణ తరగతులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఏపీ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు తగ్గిపోయాయన్నారు. ఆరోగ్య బీమా పొందాలంటే గుర్తింపు కార్డు అవసరమని.. ప్రభుత్వం ఇందుకు జీవో జారీ చేసినా ఆమోదం పొందలేదని చెప్పారు. దీనిపై మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో సభ్యులంతా పాల్గొనాలని కోరారు. బిహార్ మాదిరిగా జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శిక్షణ పొందిన విలేకర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సీనియర్ పాత్రికేయుడు బొల్లిముంత కృష్ణను సత్కరించారు. సీఆర్ మీడియా అకాడమీ, ఏపీ డబ్ల్యూజే తెనాలి శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో తెనాలి శాఖ అధ్యక్షుడు చందు సుబ్బారావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, కార్యదర్శి మణిరామ్, చందు జనార్దన్, విద్యాధర మురళీ, ఏచూరి శివ, మీరా, వీరవల్లి మురళి, గోపిచంద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఏడు అంశాలలో నిర్వహించిన పునశ్చరణ తరగతుల్లో ఆంధ్రజ్యోతి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి దేవగళ్ల రామకృష్ణ.. విలేకర్ల నుంచి డెస్క్ ఏం కోరుకుంటుంది.. అనే అంశాన్ని వివరించారు. గ్రామీణ వార్తలు - కథనాలు అనే అంశంపై సీనియర్ పాత్రికేయులు సోమసుందర్, పత్రికా భాష - మెళకువలు అనే అంశంపై ఆంధ్రజ్యోతి తూర్పు గోదావరి జిల్లా డిప్యూటీ న్యూస్ ఎడిటర్ మంగేష్ ప్రసంగించారు. స్మార్ట్ రిపోర్టింగ్ అనే అంశాన్ని విశాలాంధ్ర వర్కింగ్ ఎడిటర్ అజయ్ అవగాహన కల్పించారు.



శిక్షణ పొందిన గ్రామీణ విలేకర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సురేష్‌కుమార్

ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో కేసీ డివిజన్ అధికారులు వరద ప్రవాహాన్ని లెక్కించారు. 1,12,604 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా కేఈ మెయిన్ కెనాల్‌కు 10,271, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 7,508, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగతా 94,625 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. బ్యారేజ్‌లో ప్రస్తుతం నీటిమట్టం 12 అడుగుల వద్ద కొనసాగుతోంది. 65 గేట్లను రెండు అడుగులు, ఐదు గేట్లకు ఒక అడుగు పైకి ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



విద్యుదాఘాతంతో రైతు మృతి



తహసిల్ నాయక్ (ఫైల్ ఫొటో)

బొల్లాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో ఆదివారం భూక్యా తహసిల్ నాయక్(50) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. భార్య మంగాబాయితో కలసి గ్రామ సమీపంలో పత్తి ఇరవటానికి నాయక్ వెళ్లాడు. అక్కడ పొలానికి వేసిన సోలార్ ఫెన్సింగ్ మీద కరెంట్ తీగ పడి ఉంది. దీనిని గమనించని నాయక్ ఫెన్సింగ్ దాటుతుండగా.. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య మంగాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు బొల్లాపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు



తహసిల్ నాయక్ (ఫైల్ ఫొటో)

కొల్లిపర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో స్నానానికి దిగి యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రం కొల్లిపర శివారు కొత్తబొమ్మువానిపాలెంలో జరిగింది. ఎస్‌ఐ కోటేశ్వరరావు వివరాలు మేరకు.. మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన వేము రవికిరణ్ (19) స్నేహితులతో కృష్ణా నదికి వచ్చాడు. నదిలో రవికిరణ్ ఈత కొడుతుండగా.. నీటి ఉరవడికి కొట్టుపోయాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలపగా.. ఎస్‌ఐ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈత గాళ్లతో వెతికించారు. ఎట్టకేలకు రవికిరణ్ మృత దేహం లభ్యం పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు.

చర్చి కమిటీ నిధుల విషయంలో ఘర్షణ

● జమా ఖర్చులు కోరిన టీడీపీ సభ్యులపై దాడి

పెదనందిపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రులో ఆదివారం సాయంత్రం టీడీపీ, వైసీపీ వర్గీయులు చర్చి కమిటీ విషయంలో ఘర్షణపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీలోని ఏఈఎల్‌సీ చర్చి కమిటీ ప్రెసిడెంట్‌గా వైసీపీకి చెందిన అన్నలదాసు చిన్న ఏసురత్నం గతంలో పనిచేశారు. అతను పనిచేసిన కాలంలో చర్చికి సంబంధించిన జమా ఖర్చుల వివరాలు తెలియజేయాలని నూతనంగా ఎన్నికైన టీడీపీకి చెందిన కొందరు సభ్యులు.. ప్రస్తుత అధ్యక్షుడు కొప్పుల యోహానును అడిగారు. దీంతో ఆదివారం సాయంత్రం తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వారికి లెక్కలు చెప్పేదేంది అంటూ మాజీ ప్రెసిడెంట్ అన్న కొడుకు అన్నలదాసు జయంతిరావు, ప్రస్తుత ప్రెసిడెంట్ కొప్పుల యోహాను కర్రలతో టీడీపీ సానుభూతిపరులు రవి, సుశీలరావును తీవ్రంగా కొట్టి గాయపర్చారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ మధుపవన్ చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి, ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రెంటచింతల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలకు సమీపంలోని గొట్టిముక్కల మేజర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని నాయుడుపేటకు చెందిన బిళ్లా తేజ(22), కొరపాటి ఆరోగ్యరాజు గురజాల నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మాచర్ల నుంచి నెల్లూరుకు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొనడంతో.. తేజ అక్కడికక్కడే మృతి చెందాడు. కొరపాటి ఆరోగ్యరాజుకు కుడి కాలు, తల, పొట్ట మీద గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడ్ని గురజాల ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

జార్ఖండ్ వాసికి
తెనాలిలో దహన సంస్కారాలు

● రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య
● అధికారులకు లేఖ రాసిన మాజీ సీఎం అర్జున్ ముండా

తెనాలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కూలీ తెనాలి రైల్వేస్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ రాష్ట్ర మాజీ సీఎం అర్జున్ ముండా ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాశారు. అయితే.. మృతదేహాన్ని అక్కడకు పంపే వీలుకాకపోవడంతో రెవెన్యూ, రైల్వే పోలీసులు.. స్థానికులు, కుటుంబ సభ్యులతో కలిసి తెనాలిలోనే దహన సంస్కారాలు పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం గురుదేవ్ సర్దార్ (33) అనే వ్యక్తి తెనాలి రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వద్ద ఆధారాలతో రైల్వే పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. అతని మృతదేహాన్ని జార్ఖండ్‌కు పంపే ఏర్పాటు చేయాలని మాజీ సీఎం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాశారు. మృతుడు ట్రైబల్ కుటుంబానికి చెందిన వారు కావడం, పేదరికం కారణంగా మృతదేహాన్ని పంపే బాధ్యతను తీసుకోవాలని కోరారు. మూడు రోజులు కావడంతో మృతదేహాన్ని తరలించేందుకు వీలు కాకపోవడంతో తెనాలి వచ్చిన బంధువుల సమక్షంలో ఆదివారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, రైల్వే ఎస్‌ఐ వెంకటాద్రి శవ పంచనామా నిర్వహించారు. శ్రీ శివలింగేశ్వర స్వామి భక్తబృంద సేవా సమితి సభ్యులు సహకారంతో తెనాలి దహన వాటికలో అంతిమ సంస్కారాలు చేయించి.. వారికి మరణ నివేదికను అందజేశారు.



మృతుని బంధువులను విచారిస్తున్న తహసీల్దార్, రైల్వే ఎస్‌ఐ

8 నుంచి దివ్యాంగుల క్రికెట్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకలగుంట మైదానంలో ఈ నెల 8, 9, 10వ తేదీల్లో దివ్యాంగులకు సెంట్రల్ జోన్ ఇన్‌క్లూజివ్ క్రికెట్ కప్ నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా దివ్యాంగ క్రికెట్ సంఘ కన్వీనర్ నీరుకొండ లీలాకృష్ణారావు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాల జట్లు పాల్గొంటాయని చెప్పారు. సంఘ సహాయకార్యదర్శి షేక్ నాగులమీరా, సురేష్ పాల్గొన్నారు.

అద్వితీయంగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమంలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో రెండో స్థానం సాధించి, రికార్డు సృష్టించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణుల సమష్టి కృషికి ఇది నిజమైన గుర్తింపు అన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న నాయకులు, శ్రేణులకే ఈ గౌరవం దక్కుతుందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. నియోజకవర్గాల వారిగా చూస్తే వినుకొండ రాష్ట్రస్థాయిలో 7వ స్థానం, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. పల్నాడు జిల్లా నుంచి పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజక వర్గాలు రాష్ట్రస్థాయిలో 9, 10 స్థానాలు దక్కించుకున్నాయన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో వినుకొండ, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో నూరు శాతం పూర్తిచేయగా.. మాచర్లలో 98.5 శాతం, గురజాలలో 94.3 శాతం, సత్తెనపల్లిలో 86.9 శాతం, నరసరావుపేటలో 71.9 శాతం పూర్తయిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో నమ్మకంతో అప్పగించిన జిల్లా పార్టీ బాధ్యతలను సమన్వయంతో నెరవేర్చే ప్రయత్నంలో ఇది కీలక మైలురాయిగా భావిస్తున్నట్లు కొమ్మాలపాటి పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన వారికి అభినందనలు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని ఏనుగుపాలెం గేటు సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. ఒప్పిచర్ల గ్రామానికి చెందిన మల్లవరపు సతీష్‌కు వినుకొండలోని శృంగారపువనంకు చెందిన కెజియాతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఇతను ఇతర ప్రాంతాలకు వెళ్లి తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఏనుగుపాలెం గేటు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అంజి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడు శిఖా గోపీ (50)ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక కళ్లం అపార్ట్‌మెంట్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. కారంపూడికి చెందిన గోపీ పిడుగురాళ్లలో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.

వృద్ధురాలిపై దాడి.. బంగారం అపహరణ

సత్తెనపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడి చేసి, బంగారు ఆభరణాలు దొంగలు అపహరించుకెళ్లిన ఘటన పట్టణంలోని పార్కు ఏరియాలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పార్కు ఏరియాలో కేశినేని లక్ష్మీదేవమ్మ నివాసం ఉంటోంది. ఇద్దరు దొంగలు ఆమె గృహంలోని ఓ గదిలోకి వెళ్లి బీరువాను పగల గొట్టారు. లోపల మరో తాళం ఉండటంతో.. బయటకు వెళ్లి లక్ష్మీదేవమ్మను పిలిచారు. ఆమె రావడంతోనే.. మెడలోని ఐదు సవర్లున్న రెండు బంగారు చైన్‌లను లాక్కున్నారు. ప్రతి ఘటించిన ఆమెపై దాడి చేసి గాయపరిచారు. లక్ష్మీదేవమ్మ సొమ్మసిల్లి కింద పడిపోయింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు, క్లూస్ టీమ్ గృహానికి వచ్చి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

టీ స్టాల్‌లో ఉరేసుకున్న యువకుడు

చిలకలూరిపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లోని ఉన్న టీస్టాల్ ఆవరణలో ఆదివారం ఓ యువకుడు ఉరివేసుకుని చనిపోయాడు. మృతుడు ప్రకాశం జిల్లా మద్రిపూడి మండలం చమట గ్రామానికి చెందిన సాగిలి ఓబుల్ రెడ్డి(35)గా పోలీసులు గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. అర్బన్ ఎస్‌ఐ చెన్నకేశవులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌జీఓ క్లబ్ ఆవరణలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 138 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని సంఘ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రకాశం జిల్లా చేవూరులో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు అంతర్జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని తెలిపారు. సంఘ అధ్యక్షుడు శివశంకర్ కొల్లి లక్ష్మీనారాయణ, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాటా.. కనికట్టు

(5వ పేజీ తరువాయి)

మందికి(27.71 శాతం)మాత్రమే రేషన్ సరుకులు సరఫరా చేయగలిగారు. ఇందులోనూ పోర్టబిలిటీ కార్డులు 71165 ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లాలో 1289 షాపుల పరిధిలో 2,83,265(44.61 శాతం) మందికి సరుకులు పంపిణీ చేశారు. ఈ జిల్లాలో పోర్టబిలిటీ ద్వారా సరుకులు తీసుకెళ్లిన కుటుంబాలు 1,02,410 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 1123 దుకాణాల పరిధిలో 1,78,359 (37.46 శాతం) సరుకుల పంపిణీ జరగ్గా పోర్టబిలిటీ ద్వారా 49,836 మంది తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డీలర్ల వద్ద ఉన్న ఎండీయూల ఎలక్ట్రానిక్ కాటాలు (హుక్ టైప్‌వి) స్వాధీనపరుచుకోవాలని వినియోగదారుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు. అలానే డీలర్ పేరుతో లింక్ చేసిన ఎలక్ట్రానిక్ కాటా ద్వారానే సరుకుల పంపిణీ జరిగేలా చూడాలని, జియో కో-ఆర్డినేట్స్‌ని ఈ విషయంలో పరిగణనలోకి తీసుకునేలా నిబంధనలు మార్పు చేయాలని కోరుతున్నారు.

ఇంజనీరింగ్..సందడికి సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సీట్లు మిగిలిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మూడో విడత నోటిఫికేషన్ జారీ చేసేలా ఒప్పించేందుకు యాజమాన్యాలు కసరత్తు చేస్తున్నాయి.

ఆశావహ దృక్పథంతో అడుగులు వేయాలి..

ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఆశావహ దృక్పథంతో విద్యను కొనసాగించాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా ఇంజనీరింగ్ కళాశాలలో అపరిమిత స్వేచ్ఛ ఉంటుంది. దీనిని దుర్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని పలువురు హెచ్చరిస్తున్నారు. తరగతుల ప్రారంభం నుంచే చదువుపై దృష్టి పెట్టడంతో పాటు నైపుణ్యాలు పెంచుకునే దిశగా కృషి చేయాలని సూచిస్తున్నారు. ఏ సంవత్సరం సబ్జెక్టులు ఆ సంవత్సరం పూర్తి చేయడంతో పాటు అదనపు నైపుణ్యాలను నేర్చుకుంటూ ఉండాలన్నారు. లేనిపక్షంలో చివరి సంవత్సరంలో క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాల ఎంపిక కష్టతరమవుతుందని స్పష్టం చేస్తున్నారు. సబ్జెక్టు నైపుణ్యంతో పాటు ఇతర సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకునే దిశగా కృషి జరగాలని సూచిస్తున్నారు. సామాజిక మాధ్యమాలను చెడు అవసరాల కోసం కాకుండా నైపుణ్యాలు పెంపు కోసం ఉపయోగించుకుంటూ విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. సెల్‌ఫోన్‌కు సాధ్యమైనంత తక్కువ సమయం కేటాయించాలన్నారు.

ఎత్తిపోతలలో బాలుడి గల్లంతు

విజయపురిసౌత్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతల జలాశయంలో యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన సమీర్ (16) తన స్నేహితునితో కలిసి ఎత్తిపోతలకు వచ్చాడు. ఈత కొట్టేందుకు ఎత్తిపోతల జలాశయంలో దిగి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని.. గజ ఈతగాళ్లతో గాలించారు. చీకటి పడడంతో సమీర్ జాడ గుర్తించడం గజ ఈతగాళ్లకు కష్టంగా మారింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

నారాయణపురంలో తాగునీటి సమస్య

దాచేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం 15వ వార్డులో స్థానికులు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. నారాయణపురం నుంచి నడికూడి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై ఉన్న వాటర్ పైపులను తొలగించి వేశారు. ఫలితంగా 15వ వార్డు రైల్వే స్టేషన్ రోడ్డులో తాగు నీటికి ఇబ్బందిపడుతూ మహిళలు మునిసిపాలిటీ ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా ముగించి పైపులైన్‌లను పునరుద్ధరించి తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

అమ్మవార్లకు బోనాలు

దాచేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్రుపాలెంలో గ్రామస్తులంతా ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సౌదర్‌రాజన్ బందోబస్తు నిర్వహించారు.

నేడు బండ్ల హాస్పిటల్ ప్రారంభోత్సవం

పిడుగురాళ్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమా హాల్ సెంటర్లో గల ఉన్నం కాంప్లెక్స్‌లో సోమవారం నూతనంగా నెలకొల్పనున్న బండ్ల హాస్పిటల్‌ను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై హాస్పిటల్ ప్రారంభించనున్నారని హాస్పిటల్ యాజమాన్యం బండ్ల నాగేశ్వరరావు, డాక్టర్ మణిదీప్, వైష్ణవి తదితరులు తెలిపారు.


వేమవరం సంగం డెయిరీలో బోనస్ పంపిణీ చేస్తున్న డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు తదితరులు

డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోండి

● బోనస్ పంపిణీలో డైరెక్టర్ పులుకూరి

మాచవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ రైతులకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగపరుచుకోవాలని సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం మండలంలోని వేమవరం సంగం డెయిరీలో 285 మంది పాల ఉత్పత్తిదారులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ 7,49,594 బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి పల్నాడు జోనల్ మేనేజర్ కట్టా నరేష్ బాబు, ఇన్‌చార్జ్ మేనేజర్ ఏ నవీన్, సంఘ అధ్యక్షులు మోమిని జాన్ సాహెబ్, నారపశెట్టి నారయ్య, వెంకటేశ్వర్లు, ఇప్పాల బాపయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అత్యధికంగా పాలు పోసిన వారికి స్టీల్ క్యాన్‌లు, నగదు పంపిణీ చేశారు.


కేక్ కట్ చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

రికార్డు స్థాయిలో కంటి శస్త్ర చికిత్సలు

మాచర్లటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రిలో జూలైలో మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 1007 కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహించినట్లు ఆసుపత్రి చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఆదివారం కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఆసుపత్రి సెక్రటరీ డాక్టర్ ఎస్ మురహరిరావు, డైరెక్టర్లు కర్నాటి శ్రీనివాసరావు, చెరుకూరి నరసింహారావు, మారేపల్లి లక్ష్మీనారాయణ, శేరెడ్డి గోపిరెడ్డి, కేసీపీ మేనేజింగ్ బండారుపల్లి వెంకటేశ్వరరావులు సిబ్బందిని, కంటి ఆసుపత్రి వైద్యులు యశ్వంత్, మోనీషాలను అభినందించారు.


నల్లపాటి రామకోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యరపతినేని నిఖిల్, పార్టీ శ్రేణులు

పలు కుటుంబాలకు నిఖిల్ పరామర్శ

పిడుగురాళ్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ ఆదివారం పట్టణంలోని 24వ వార్డు కన్వీనర్ నల్లపాటి నెహ్రూ తండ్రి రామకోటయ్య దశదిన కార్యక్రమానికి హాజరై రామకోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. 31వ వార్డులోని షేక్ ఇమ్రాన్, 2వ వార్డులోని కొండా శ్రీనివాస్ కుటుంబాన్ని నిఖిల్ పరామర్శించారు. కార్యక్రమాలలో ఏఎంసి చైర్మన్ వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సాంబశివరావు, పొందూరి నరసింహారావు, తాళ్ల వాసు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలివ్వాలి

క్రోసూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి అన్నారు. దొడ్లేరులో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాలు పిల్లలకు వ్యాక్సిన్‌లా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రవీణ్ సమక్షంలో ప్రమాణం చేస్తున్న జగదీష్, ధాత్రినారాయణ, పూర్ణయ్య.

రైతులకు మెరుగైన సేవలందించాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నరుకుళ్లపాడు పీఏసీఎస్ పరిధిలోని రైతులకు సకాలంలో ఋణాలు మంజూరుచేసి మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం నరుకుళ్లపాడు పీఏసీఎస్ నూతన చైర్పర్సన్, పర్సన్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రవీణ్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా 14వ మైలు సెంటర్ నుండి కూటమి నాయకులు, కార్యకర్తలు ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి నాయకులకు స్వాగతం పలికారు. నరుకుళ్లపాడు పీఏసీఎస్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌గా భాష్యం జగదీష్, పర్సన్స్‌గా కామిరెడ్డి పూర్ణయ్య, ధాత్రినారాయణ బాధ్యతలు స్వీకరించి ఎనికపాడు గ్రామంలో ఎమ్మెల్యే ప్రవీణ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకుడు కె.వసంతరావు అధ్యక్షత వహించగా మునగోడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శౌరయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ సంఘ పరిధిలోని ఆస్తులను పరిరక్షించాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పనిచేయాలన్నారు. భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ జగదీష్ పార్టీకి చేసిన సేవను గుర్తించి చైర్‌పర్సన్ పదవిని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో రెండు కిసాన్ డ్రోన్‌లను రైతులకు అందజేశారు. అనంతరం సంఘ పరిధిలోని రైతులకు నూతనంగా మంజూరైన రూ.2కోట్ల చెక్కును ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, నూర్జహాన్, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, భాష్యం అమర్, కన్యధార భాస్కరరావు, సజ్జా గిరిధర్, మహేష్, ఎన్ నాగార్జున, బీ సూర్యనారాయణ, సీతంట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్‌లో పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 2,12,750

విజయపురిసౌత్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌కు ఆదివారం పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివచ్చి సందడి చేశారు. సాగర్ నూతన బ్రిడ్జి, పాత బ్రిడ్జి, లాంచీస్టేషన్ పర్యాటకులతో సందడిగా మారాయి. లాంచీలలో నాగార్జున సాగర్ కొండ మ్యూజియంను సందర్శించారు. అనంతరం అనుపు, యాంపీ స్టేడియం, అశ్వమేథ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయం, ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. శనివారం లాంచీల ద్వారా రూ.2,12,750 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు అధికారులు తెలిపారు.


రెంటచింతలలోని 167 ఏడి జాతీయ రహదారి

ప్రమాదభరితంగా జాతీయ రహదారి

రెంటచింతల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రెంటచింతల గ్రామ పొలిమేరల్లో నిర్మితమైన జాతీయ రహదారిలో కొంత భాగం గుంతలతో నిండి ఉంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాచేపల్లి నుంచి మాచర్ల వరకున్న 167 ఏడి జాతీయ రహదారిలో రెంటచింతల-మిట్టగుడిపాడు మధ్య రహదారి అధ్వానంగా ఉంది. 319 ఏ3 సర్వేనెంబర్‌లో బాధిత రైతు 23 సెంట్లకు నేటికీ నష్టపరిహారం చెల్లించకపోవడమే సమస్యకు కారణం. అధికారులు సమస్యను పరిష్కరించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రైలు బోగీల సంఖ్య పెంచాలి

● ఎంపీ లావుకు వినతిపత్రం అందజేసిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు


ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

రెంటచింతల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి విజయవాడ వెళ్లే రైలుకు ప్రస్తుతం వున్న బోగీల సంఖ్యను పెంచాలని, రెంటచింతల రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులకు కనీస సౌకర్యాలను కల్పించాలని కోరుతూ గ్రామ సామాజిక అభివృద్ధి కమిటి సభ్యులు ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలను కోరారు. ఆదివారం గుంటూరులోని ఎంపీ నివాసానికి వెళ్లిన అధ్యక్షుడు కేశవరెడ్డి, ఎన్.శ్రీనివాసరావులు వినతిని అందచేశారు. రెంటచింతల-గుంటూరుకు రైలుకు ఛార్జి రూ.35 కాగా బస్సుకు రూ.155 ఉందన్నారు. దీంతో రైలు ఎక్కే ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. సోమవారం ఉదయం మాచర్లలోనే రైలు ప్రయాణీకులతో కిక్కిరిసి వస్తుందని, రెంటచింతల నుంచి నిలబడే అవకాశం కూడా ఉండడం లేదన్నారు. ఎంపీ స్పందిస్తూ రైల్వే మంత్రికి సమస్యను వివరిస్తామని హామీనిచ్చారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్ అవుతోంది

● టీడీపీ నాయకులు పులిబండ్ల

రాజుపాలెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం మాటకు కట్టుబడి పనిచేస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు పులిబండ్ల సాంబశివరావు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము రైతుల ఖాతాలోకి జమచేసిన సందర్భంగా ఆదివారం మండలంలోని రాజుపాలెంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కన్నా చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పెమ్మా అంకమ్మరావు, జెట్టి కోటేశ్వరరావు, పెద్దింటి శ్రీనివాసరావు, చొక్కా రాంబాబు, యమర్తి వెంకట్రామయ్య, లేబాకుల బ్రహ్మయ్య, దుడుకు శ్రీనివాసరావు, గుమ్మా పుల్లయ్య ఉన్నారు.

డొంక రోడ్లకు మహర్దశ

రాజుపాలెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంక రోడ్లకు మహర్దశ పట్టింది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చొరవతో అన్ని గ్రామాలలో పొలాల డొంక రోడ్లు అభివృద్ధి చెందనున్నాయి. ఎంపీ ఎక్స్‌కవేటర్ పంపటంతో బలిజేపల్లిలో నిర్మించతలపెట్టిన భువనచంద్ర చెక్ డ్యామ్ చుట్టూ పెరిగిన పెద్దపెద్ద చెట్లను తొలగించి మట్టి చదును చేస్తున్నారు. అనంతరం బలిజేపల్లి, ఉప్పలపాడు గ్రామాల డొంకరోడ్లను బాగుచేస్తున్నారు. నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నల్లమోతుల శ్రీనివాసరావు ఎంపీని, ఎమ్మెల్యే కన్నాని కోరగా వారు ఎక్స్‌కవేటర్ పంపారు. ఆదివారం పనులు ప్రారంభించారు.

డీటీపీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

నకరికల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో డీటీపీ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు డైరెక్టర్ టీ సందీప్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు మధ్య గలవారు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, నాలుగు ఫోటోలు, విద్యార్హత పత్రాలు తీసుకొని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ 14-1-14, ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్, కొత్తపేట, గుంటూరులో సంప్రదించాలన్నారు. వివరాలకు 9700687696, 8125397953, 9949930155 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రాష్ట్రంలో పండుగ వాతావరణం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్లటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండు నెలలుగా రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతులకు, సామాన్యులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో 46.85 లక్షల మంది రైతులకు మొదటి విడత లబ్ధి చేకూరిందన్నారు. మేజర్, మైనర్ కాలువల్లో పూడిక తొలగించారన్నారు. వరకిపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి అటవీశాఖకు రూ. 14.81 కోట్లు విడుదలయ్యాయన్నారు. జలసిరి ప్రాజెక్ట్ ద్వారా రూ.780 కోట్లు, తారురోడ్లకు రూ.118 కోట్లు, తాళ్లపల్లి వద్ద కేంద్ర విద్యాలయం కోసం రూ.26 కోట్లు లభించాయన్నారు.

బైపాస్ రోడ్డు ప్రారంభం

క్రోసూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 88 తాళ్ళూరులో నిర్మాణమైన బైపాస్ రోడ్డును గ్రామ సర్పంచ్ కలకోటి ఏసమ్మ ఆదివారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.కోటి వ్యయంతో ఈ రోడ్డును నిర్మించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసమ్మ ఎమ్మెల్యే ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జీ బాలరామకృష్ణంరాజు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, రాయపాటి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న సుఖీభవ..

రెంటచింతల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పాలువాయి గ్రామ సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి నేతృత్వంలో ఆదివారం సీఎం చంద్రబాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎం హనిమిరెడ్డి, సాంబయ్య, తుఫాన్‌రెడ్డి, కోటిరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసరావు, చిన్నోడు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబాలెం మేజరుకు మహర్దశ

● టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని ఎర్రబాలెం మేజరు కాలువలకు మహర్దశ పట్టిందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ ఆదివారం పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎర్రబాలెం మేజరుకు మహర్దశ వచ్చిందని తెలిపారు. గత వారం రోజుల నుంచి ఎర్రబాలెం మేజరుకు మరమ్మతులు చేశారు.

నేల బావిలో పడి యువకుడి మృతి


మహంకాళి దుర్గా ప్రవీణ్ (ఫైల్ ఫోటో)

మాచవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నేల బావిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మాచవరంలో ఆదివారం జరిగింది. బంధువులు, స్థానికుల కథనం మేరకు.. మాచవరం గ్రామానికి చెందిన మహంకాళి దుర్గా ప్రవీణ్(22) కొద్దికాలంగా మతిస్థిమితం లేక ఉన్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. కన్పించటం లేదంటూ తల్లిదండ్రులు కిట్టయ్య, సంపూర్ణ బంధువుల వద్ద వెతుకుతున్నారు. ఆదివారం మాచవరంలోని పెదబావిలో ఆ యువకుడి మృతదేహం తేలిన దృశ్యాన్ని స్థానికులు కనుగొన్నారు. మృతదేహాన్ని బయటకు తీశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

రాజుపాలెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై మండలంలోని రెడ్డిగూడెం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన షేక్ సుభాని తన ద్విచక్ర వాహనంపై నగవరం రహదారికి ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకుకు వస్తూ ఎదురుగా వస్తున్న సుమారు 60 సంవత్సరాల వయస్సు కల్గిన గుర్తు తెలియని వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై వేణుగోపాల్ సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి..

సత్తెనపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ ఈనెల 5న అన్ని సచివాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించేందుకు గృహాలకు వస్తే ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో డీ విమల, సుధ, శివ పార్వతి, ప్రసాదరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పోలేరమ్మ తల్లి సన్నిధిలో జూలకంటి

మాచర్ల రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరంలో ఉన్న శ్రీపోలేరమ్మ తల్లి తిరుణాళ్ల మహోత్సవం సందర్భంగా అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● మాచర్లటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో ఉన్న గ్రామ దేవతను ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రామస్వామి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు

రామస్వామి జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎలినేడి రామస్వామి జన్మదిన వేడుకలను పార్టీ నేతలు నిర్వహించారు. రామస్వామి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు రామస్వామి దంపతులకు గజమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, చౌట శ్రీనివాసరావు, సయ్యద్ పెద కరిముల్లా, బండారు నాగరాజు, కట్టా రమేష్, దరువూరి నాగేశ్వరరావు, ఎలినేడి లక్ష్మీ తులసీ, బోడెంపూడి రాజేశ్వరి, పోతుగంటి రామకోటేశ్వరరావు, పచ్చ సుధీర్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద కూడా రామస్వామి పుట్టినరోజు వేడుకలను టీడీపీ నేతలు నిర్వహించారు.

విద్యార్థులు నిష్ణాతులుగా మారాలి

● ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

అచ్చంపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాలానికి అనుగుణంగా విద్యార్థులు స్కిల్స్ పెంచుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఆదివారం గుంటూరులోని ఎంపీ కార్యాలయం వద్ద స్నేహహస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేశారు. తిరుపతి ఎంబీబీఎస్ విద్యార్థి బిందుశ్రీకి రూ.98వేలు, బీటెక్ విద్యార్థిని ఎం.భావనకి రూ.45వేలు, బీటెక్ విద్యార్థి పి.గౌతమ్‌కి రూ 60వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్నేహ హస్తాల ఫౌండర్ కూరపాటి శివరామ్, కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు, మన్నెం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డబ్బిస్తేనే సంతకాలు..

దుర్గి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దుర్గి గ్రామ పంచాయతీ అధికారుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. ఏ పని కావాలన్నా చేయి తడపందే పని కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులతో ఈ దందా నడిపిస్తున్నారు. ఇంటి పన్ను కట్టాలన్నా అధికంగా రుసుం చెల్లించాల్సిందే. కట్టిన డబ్బులకు రసీదులు పాతవి ఇస్తున్నారు. తాము అడిగినవి ముట్టచెబితే అద్దెలకు ఉన్న వారి పేరున అయినా రసీదు ఇస్తారు. తాము అడిగింది ఇవ్వకపోతే ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు. వీరి దందాలపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ అధికారుల అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

సత్తెనపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1982-84 ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రకాశం జిల్లా జడ్జి రాజావెంకటాద్రి మాట్లాడుతూ 39 సంవత్సరాల తరువాత చిననాటి స్నేహితులను కలుసుకోవటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాజవరపు శివ నాగేశ్వరరావు, ఎం సుబ్బారెడ్డి, ఏ మురళీ, జీ శ్రీనివాసరావు, ఏ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, అబ్దుల్ రహీం, ఖాజావలి, పెదశ్రీనివాసరావు, చినశ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ కలయిక

● 1975-76 బ్యాచ్ విద్యార్థుల సమావేశం

పిడుగురాళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో 1975-76 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం హైస్కూల్‌లో జరిగింది. నాటి గురువులను గుర్తుచేసుకుంటూ చదివిన తరగతి గదులను కలియతిరిగి మధుర జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు నాటి గురువులను సన్మానించారు.


జడ్పీహైస్కూల్‌లో సమావేశమైన 1975-76 పూర్వ విద్యార్థులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

టీడీపీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు: జీవీ

వినుకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం 100శాతం పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని 100 శాతం ఇంటింటికి తిరిగి సర్వే పూర్తి చేసి ఎంతో కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో వినుకొండను 7వ స్థానంలో నిలిపిన టీడీపీ నాయకులకు, క్లస్టర్ ఇన్‌చార్జిలకు, యూనిట్ ఇన్‌చార్జిలకు, బూత్ ఇన్‌చార్జిలకు, గ్రామ పార్టీ అధ్యక్షులకు, కార్యకర్తలకు, తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త రఘు రామయ్య కళాశాల గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమావేశం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొత్త రఘు రామయ్య కేఆర్ కళాశాల స్థాపించి 50సంవత్సరాలు (1975-2025) పూర్తయిన సందర్భంగా కళాశాలలో పనిచేసిన, పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాదు ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. మొదటి తరం అధ్యాపకులు గరికపాటి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఆజాద్, రామయ్య, అబ్బూరి లక్ష్మీనారాయణ, మార్టిన్, నలబోతు రాధాకృష్ణ, ఎం హరిబాబు, వెంకటరెడ్డి, ఐసన్‌హోవర్, కోటయ్య, రామారావు, శారదాదేవి, పూదోట ప్రమీలా, పీవీ కోటేశ్వరరావు, వీరరాఘవులు, సునీత, లక్ష్మీబాయి, వెంకటేశ్వరరావు, వైవీడీ ప్రసాద్, సతీష్, బాబురావుకోటయ్య తదితరులు పాల్గొన్నారు. గోల్డెన్ జూబ్లీ సమావేశానికి ప్రస్తుత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు, పీడీ ప్రిన్సిపాల్ డాక్టర్ కౌషిక్, పాల్గొనగా, డాక్టర్ గోపాలకృష్ణ వందన సమర్పణతో కార్యక్రమం ముగించారు.

నేటి నుంచి న్యాయవాదుల నిరవధిక విధుల గైర్హాజరు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి), నిబంధనలకు విరుద్ధంగా, న్యాయవాదుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న స్థానిక 13వ అదనపుజిల్లా న్యాయ అధికారి నేతిసత్యశ్రీ, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.లావణ్యలను బదిలీ చేయాలని న్యాయవాదులు విధులకు గైర్హాజరు కానున్నారు. నరసరావుపేట న్యాయవాద సంఘానికి గుంటూరు జిల్లాలోని పలు న్యాయవాద సంఘాలు సంఘీభావం తెలిపాయి.

అన్నవరం మేజరుకు నీరు విడుదల

రొంపిచర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం మేజరుకు నీటిని ఆదివారం విడుదల చేశారు. డీఈ విజయలక్ష్మి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్ యాంపాటి కోటిరెడ్డి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఈదర నాగేశ్వరరావు, పొనుగోటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

తృతీయ సోపాన్ శిబిరం

నాదెండ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయంలో తృతీయ సోపాన్ పరీక్షా శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం యోగా, వ్యాయామంతో శారీరక ధృడత్వాన్ని పెంపొందించుకునే విషయంపై శిక్షణ ఇచ్చారు. వివిధ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలతో అలరించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ నీరజ్ కుమార్ శ్రీవాస్తవ, ఎస్.విజయకుమార్, రవీందర్, రామ్‌కోటి, మృత్యుసమర్దర్ పాల్గొన్నారు.

యునైటెడ్ ఫ్రంట్ సమావేశం

వినుకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్ సమీపంలో ఓ ప్రైవేటు కార్యాలయంలో కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా అధ్యక్షతన ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకుల ముఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ కలీమ్ మాట్లాడుతూ యునైటెడ్ ఫ్రంట్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రతినియోజకవర్గంలో కమిటీలను ఏర్పాటు చేసి ముస్లిం సమాజంలోని యువతకు సామాజిక స్పృహతో పాటు రాజకీయ చైతన్యం కలిగించేందుకు త్వరలో కార్యచరణ రూపొందిస్తామన్నారు.

నేడు అంగులూరులో విగ్రహ ప్రతిష్ఠ

ఈపూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరులో శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మూడు రోజులుగా గ్రామంలో పూజా కార్యక్రమాలను చేస్తున్నారు.

వరి సాగుకు సన్నద్ధం

బోర్ల కింద నారుపోస్తున్న రైతులు



వెల్లటూరులో బోర్ల కింద సాగవుతున్న నారు మడి

బొల్లాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టు రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పూర్తి స్థాయిలో కురవకపోవటంతో అధికశాతం భూములు ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం శ్రీశైలం డ్యామ్ నిండటంతో పాటు సాగర్ జలాశయానికి పుష్కలంగా నీరు చేరటంతో కుడి కాలువకు నీరు విడుదల చేశారు. ఈ వారంలో రెండో జోన్‌కు కూడా నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో సాగర్ ఆయకట్టు రైతులు వరిసాగుకు సిద్ధమవుతున్నారు. ముందుగా వరినాట్లు వేసేందుకు బోర్లు వసతులు ఉన్న రైతులు ముమ్మరంగా నార్లు పోస్తున్నారు. సాగర్ జలాలు విడుదలయ్యే సమయానికి ఈ నారు అందుబాటులోకి వస్తుందని, ఈ క్రమంలో ముందుగా వరినాట్లు వేసుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. బోర్లు వసతులు లేని రైతులు ఆయకట్టు భూములను దున్ని సిద్ధం చేస్తున్నారు. సాగర్ జలాలు రాగానే వరి నారు పోసుకొనేందుకు వీలుగా మాగాణి భూములను చదును చేస్తున్నారు. గత 30 సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది జలాశయానికి ముందుగానే నీరుచేరింది. వరి పంటకు ఢోకాలేదని ధీమాతో వరి సాగుపై దృష్టి సారించారు.

సూపర్ - 6 పథకాల అమలుతో వైసీపీ గల్లంతే

● సొసైటీ కమిటీల ప్రమాణ స్వీకార సభలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



పెంటేల శేషగిరిరావును అభినందిస్తున్న పుల్లారావు

నాదెండ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సూపర్-6 పథకాల అమలుతో రాష్ట్రంలో వైసీపీ అడ్రస్ గల్లంతవుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నియోజకవర్గంలోని గణపవరం, కొమరవల్లిపాడు ప్రాథమిక సహకార సంఘాల చైర్‌పర్సన్‌లుగా పెంటేల శేషగిరిరావు, కోడె హనుమంతరావు, సభ్యులుగా హనుమంతరావు, ధర్మారావు, గొట్టిపాటి బాబు, మునీర్ హసన్‌లు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. గణపవరం, చిలకలూరిపేట కొత్త మార్కెట్ యార్డు ప్రాంగణాల్లో జరిగిన సభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పుల్లారావు మాట్లాడుతూ గత పాలకుల చేతగాని నిర్ణయాలతో గ్రామాల్లో అభివృద్ధిని దూరం చేశారని, అలాంటి వారిని గ్రామాల్లోకి రానివ్వవద్దన్నారు. సిగ్గులేకుండా బూటకపు మాటలు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ నేతలు బ్యాంకులను మోసగించి ప్రజల సొమ్మును లూటీ చేశారన్నారు. ప్రైవేట్ బ్యాంకుల కన్నా సహకార బ్యాంకులు సొంతింటి లాంటివని, వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగన్ అరాచకాలను, కుట్ర రాజకీయాలను సహించే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదన్నారు. చంద్రబాబు గతంలో ఉన్న నాయకుడు కాదని, వైసీపీ వారిని ఎక్కడ పెట్టాలో ఆయనకు తెలుసన్నారు. వైసీపీ సానుభూతిపరులు వారి బిడ్డల భవిష్యత్ కోసం చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, నాయకులు సదాశివరావు, సత్యనారాయణ, కందుల రమణ, లక్ష్మీనారాయణ, జే.మదన్, సోంబాబు, కెల్లంపల్లి అచ్చయ్య, ఎం.రవి, ఎస్.హరిబాబు, వలేటి హిమవంతరావు, వీరారెడ్డి, జయరామిరెడ్డి, లీలకృష్ణ, జాన్‌బాబు, కే.మణి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యమైన జీవనశైలి

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



యోగలో ప్రతిభచాటిన విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యోగసనాలతో ఆరోగ్య జీవనశైలిని, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం సర్వస్వతి శిశుమందిర్‌లో పల్నాడు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగసనాలలో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మెరిట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థుల సాధన, ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో శ్రీదత్త హాస్పిటల్ చైర్మన్‌తోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా ఉంటా

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా ఉండి, ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం పట్టణంలో అన్యాక్రాంతమైన బ్రహ్మంగారి దేవాలయం ఆస్తులను కాపాడాలని, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట నుంచి విజయవాడ వరకు పల్నాడు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుతారం వాసు ఆధ్వర్యంలో విశ్వకర్మ బైక్ ర్యాలీ చేపట్టారు. బైక్ ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెనుకబడిన బీసీలకు అండదండగా ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు సుతారం వాసు మాట్లాడుతూ అన్న నందమూరి తారకరామారావు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి సినిమా తీసి మాకు ఆరాధ్యదైవం అయ్యారని, మొదటి నుంచి టీడీపీకి మద్దతుగా నిలిచామన్నారు. నరసరావుపేట పట్టణంలో సత్తెనపల్లి రోడ్డులో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయం ఆస్తులను అక్రమంగా అమ్మడంపై విచారణ జరిపించి సంఘానికి చెందిన దేవాలయ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బొప్పూడి సాయిప్రసాద్, కోశాధికారి వేములూరి రాంబాబు, దాచేపల్లి టౌన్ ప్రెసిడెంట్ త్రయంబకచారి, మండల ప్రెసిడెంట్ నాగ బ్రహ్మచారి, గురజాల మండల ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, టౌన్ ప్రెసిడెంట్ కుందుర్తి కోటేశ్వరరావు, మాచర్ల నుంచి గురజాల అప్పారావు, పిడుగురాళ్ళ నుంచి దికొండ లక్ష్మణాచారి, కారంపూడి నుంచి లింగచారి, పెద్ద సంఖ్యలో విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

రూ.38లక్షల ప్యాచ్‌వర్క్ డబ్బు ఏమైంది?

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట పట్టణంలో రోడ్లను పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 3: నరసరావుపేట పట్టణంలో రోడ్ల మరమ్మతులు, ప్యాచ్ వర్క్‌ల కోసం నరసరావుపేట మున్సిపాలిటీలో రూ.38 లక్షలు డ్రా చేసిన నిధులు ఏమయ్యాయని పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఈరోజు నరసరావుపేట పట్టణంలోని చిత్రాలయ థియేటర్ పక్కన రోడ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయని, ఈ రోడ్ల ప్యాచ్ వర్క్ కోసం మున్సిపాలిటీ నుంచి రూ.38లక్షల రూపాయలు డ్రా చేశారని, కానీ ఎక్కడ కూడా ప్యాచ్ వర్క్ చేసిన దాఖలాలు కనపడటం లేదన్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం వస్తోందని, బస్టాండ్‌లో పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా ఉందని, కొత్త టాయిలెట్లు బస్టాండ్లో నిర్మించారని కానీ వాటి నిర్వహణ సక్రమంగా లేదని, నీటి సరఫరా ఇవ్వలేదని, డ్రైనేజీ మొత్తం బ్లాక్ అయ్యి, నీరు రోడ్డు మీద నిలిచి దుర్గంధం వస్తోందని ఆరోపించారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో ఎటువంటి ఫుట్‌పాత్ నిర్మాణం చేయలేదని, తిరిగి ఆక్రమించుకోకుండా ఎటువంటి చర్యలు చేపట్టలేదని, ఆక్రమణలకు గురి కాకుండాచర్యలు చేపట్టాలన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో శనివారం రాత్రి బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్నాడు జిల్లా వైసీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. సూపర్-6 పథకాల పేరుతో ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పడాల చక్రారెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

స్మార్టు మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా రేపు సదస్సు

చిలకలూరిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్టు మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా పట్టణంలోని పండరీపురంలోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాడు సదస్సు జరిగింది. సీపీఎం పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయనాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ట్రూఅప్, సర్దుబాటు చార్జీలను రద్దుచేయాలని, అదానీ స్మార్ట్ మీటర్లు బిగింపును ఉపసంహరించుకోవాలని, సకి ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద ఉన్న శాఖా గ్రంథాలయం వద్ద నుంచి ఉదయం 10గంటలకు నిరసన కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం విద్యుత్ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నా జరుగుతుందని నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు, పార్టీలకు చెందిన ఎం.రాధాకృష్ణ, వి.ముత్తయ్య, పి.వెంకటేశ్వర్లు, బి.శ్రీనునాయక్, అల్లాబక్షు పాల్గొన్నారు.

జగన్ స్మరణ తప్ప కూటమి పాలన శూన్యం

● మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం జగన్‌ను స్మరించుకోవడం తప్ప కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పరిపాలన మాత్రం శూన్యమని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శావల్యాపురంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, వైసీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలనిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలకు మోసం చేసిందని, కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వైసీపీ నాయకులు గ్రామాల్లో ప్రజలకు గడపగడపకు తిరిగి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి భీమని అంకారావు, న్యాయవాది ప్రసాద్, నేతలు బొల్లా రమేష్, జుజ్జూరి ఐరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రెండో పట్టణ అధ్యక్షుడిగా ఫణి భూషణ్

నరసరావుపేట లీగల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట భారతీయ జనతా పార్టీ రెండో పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అడపా ఫణిభూషణ్‌ను జిల్లా అధ్యక్షుడు ఏలూరు శశికుమార్ ఆదివారం నియమించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కృపారావు, ఆదినారాయణ, కృష్ణమోహన్, హనుమంతరావు, రాజీవ్‌రెడ్డి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



త్రిసభ్య కమిటీ సభ్యులను సత్కరిస్తున్న చీఫ్‌విప్ జీవీ, కొమ్మాలపాటి

సొసైటీలు రైతులకు మెరుగైన సేవలందించాలి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా సొసైటీలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత త్రిసభ్య కమిటీలదేనని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కారుమంచి సొసైటీకి ప్రభుత్వం నూతనంగా నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని సొసైటీ చైర్మన్ గోపాళం శివప్రసాద్, డైరెక్టర్లు గద్దె వీరమస్తాన్‌రావు, దారా రామకోటమ్మలతో ప్రమాణస్వీకారం చేయించారు. వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం జీవీ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమిప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు 20వేలు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్న ఘనత చంద్రబాబుదన్నారు. వినుకొండ-గుంటూరు 4వరుసల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2605కోట్లు మంజూరు చేయడం శుభపరిణామన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతుండడంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్, సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం, సీనియర్ నాయకుడు యరమాసు కోటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వర్లు, కోటా హరిబాబు, ముప్పా శ్రీనివాసరావు, వరగాని వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కును అందచేస్తున్న అర్బన్ సీఐ పి.రమేష్, మాదాసు భానుప్రసాద్

చిలకలూరిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న పట్టణానికి చెందిన హోంగార్డు మానం శ్రీనివాసరావు కుటుంబానికి రూ.25వేలు డీడీని అర్బన్ సీఐ పి.రమేష్ ఆదివారం అందచేశారు. పండరీపురంలోని హోంగార్డు నివాసానికి వెళ్లి అతడిని పరామర్శించి చెక్కును అందించారు. లోక్‌సత్తా పార్టీ నేత, న్యాయవాది మాదాసు భానుప్రసాద్ వాట్సాప్ గ్రూపు ద్వారా పిలుపునిచ్చి గ్రూపు సభ్యులనుంచి ఈ మొత్తాన్ని సేకరించి డీడీల రూపంలో సీఐ రమేష్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం హోంగార్డు కుటుంబానికి అందచేశారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ చొరవను సీఐ రమేష్ కొనియాడారు.

క్వారీలో కూలీల మృతి బాధాకరం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీ ప్రమాద ఘటనలో ఆరుగురు కూలీలు మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రావెల్ క్వారీలో మట్టి చరియలు విరిగిపడి అక్కడ పనిచేసే కూలీలు దుర్మరణం చెందారన్న వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మృతుల కుటుంబాలను క్వారీ యాజమాన్యం తగినవిధంగా ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యచికిత్స అందించాలని కోరారు. పొట్టకూటికోసం ఒడిశా నుంచి వచ్చిన వారు, ఇక్కడ పనిచేస్తూ మరణించడం బాధాకరంగా ఉందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్వారీ యాజమాన్యం భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



పోటీలో తలపడుతున్న బాలికల జట్టు

ఘనంగా కే-రిడ్జి స్కూల్‌లో ఫ్లోర్‌బాల్ పోటీలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్‌బాల్ చాంపియన్‌షిప్ అండర్-14, అండర్-19 బాలుర, బాలికల టోర్నమెంట్‌ను ఆదివారం చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆడి జాతీయ స్థాయిలో మంచి విజయాలు సాధించాలన్నారు, టోర్నమెంట్‌లో 16 జిల్లాల నుంచి 250మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ మ్యాచ్‌లో పల్నాడు జట్టు అనకాపల్లిపై 2-0 పాయింట్స్‌తో విజయం సాధించింది. కర్నూల్ జట్టు ప్రకాశంపై 2-0తో గెలిచింది. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, పల్నాడు జిల్లా ఫ్లోర్‌బాల్ సెక్రటరీ కిశోర్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీ సురేంద్ర, వివిధ జిల్లాల నుంచి సెక్రటరీలు పాల్గొన్నారు. గెలిచిన జట్టును సెప్టెంబరు 4, 5, 6, 7 తేదీలలో జరిగే జాతీయ స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తారని జిల్లా సెక్రటరీ కిశోర్‌బాబు తెలిపారు.



వివాహిత అదృశ్యం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంభంపాలెంకు చెందిన జొన్నలగడ్డ మేరీ రెండో తేదీ మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి జొన్నలగడ్డ నాగమ్మ మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మేరీ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మేరీ భర్త రమేష్ శనివారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌కు వెళదాం అని చెప్పి మోటార్ సైకిల్‌పై తీసుకొని వెళ్ళాడు. శనివారం అర్ధరాత్రి వరకు ఆచూకీ లేకపోవడంతో మేరీ తల్లి నాగమ్మ మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నకరికల్లు సమీపంలోని అడవుల్లో హతమార్చి ఉండొచ్చని ఆదివారం సాయంత్రం పట్టణంలో పుకార్లు వ్యాపించాయి. ఈ విషయమై మొదటి పట్టణ పోలీసులను వివరణ అడుగగా విషయం రూఢీ కాలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

బొల్లాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరికొండపాలెం తండాకు చెందిన ఎం.వెంకటేశ్వర్లు నాయక్ పేరూరుపాడులో పొలంలోని బోరు మోటారును తీస్తుండగా విద్యుత్ తీగ తగిలి గాయపడ్డాడు. దీంతో అతనిని వినుకొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

నేత్రదానం అభినందనీయం



పారా పిచ్చయ్య (ఫైల్‌ఫోటో)

వేల్పూరు (శావల్యాపురం) ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మరణించిన వ్యక్తి నేత్రాలను మరొకరికి దానంచేసి వారికి చూపును ప్రసాదించడం అభినందనీయమని అమ్మ నేత్ర, అవయవదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరుకు చెందిన పారా పిచ్చయ్య(78) ఆదివారం మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులు మృతుని నేత్రాలు దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారంతో పెదకాకానిలోని శంకర్ ఆసుపత్రికి చెందిన ఐ-బ్యాంక్ సిబ్బంది వేల్పూరుకు విచ్చేసి మృతుడు పిచ్చయ్య కళ్ళలోని కార్నియా పొరలను సేకరించారు. నేత్రదానంతో పలువురికి ఆదర్శంగా నిలిచిన మృతుడు పిచ్చయ్య కుటుంబ సభ్యులు వీరాంజనేయులు, మల్లేశ్వరి, సామ్రాజ్యం, వర్షిత్ లను ఐ-బ్యాంక్ సిబ్బంది, చలపతిరావు, గ్రామస్థులు అభినందించారు.